క్లుప్తంగా

వర్షం కోసం ప్రత్యేక పూజలు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో వరుణదేవుని కోసం ప్రత్యేకపూజలు నిర్వహించారు. కప్పని తీసుకొని ఇంటింటికి తిరిగి కప్ప నీళ్లుపోస్తూ వర్షం కురువాలని పూజ లు చేశారు. ఇటీవల వానలు ముఖం చాటేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

బీచుపల్లిలో పందుల స్వైరవిహారం



ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రం ఆవరణలో పందులు స్వైర విహారం చేస్తున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన వస్తుండటంతో పాటు ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయన్నారు. పందుల పెంపకదారులు పుణ్యక్షేత్రం సమీపంలోనే షెడ్లను ఏర్పాటు చేసి పెంపకం చేపట్టడంతో ఆలయ ఆవరణలో సంచరిస్తున్నట్లు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకొని ఆలయ సమీపంలో ఉన్న పందుల పెంపకం షెడ్లను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగు



ధరూరు: మండల పరిధిలోని మార్లబీడు ఎస్సీ కాలనీలో రోడ్లపై నిలిచిన మురుగుతో నానా అవస్థలు పడుతున్నట్లు కాలనీ వాసులు వాపోతున్నారు. దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. అదే విధంగా స్థానిక చర్చి వెనుక ఉన్న రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో సమస్యలు తాండవిస్తున్న ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన గాలుల తీవ్రత.. ఆందోళనలో రైతులు

రాజోళి: మండల పరధిలో గాలుల తీవ్రత పెరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు వేసి రోజులు గడుస్తున్నా సరైన వర్షం లేక దిగాలు చెందుతున్న క్రమంలో గాలుల తీవ్రత కూడా పెరగడంతో లబోదిబోమంటున్నారు. గాలుల తీవ్రత కారణంగా మొలకలు దెబ్బతిని నేలలో తేమ ఆవిరైపోతుందని వాపోతున్నారు. మరో వారంలో వర్షాలు పడకపోతే నష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తేన్నారు.

'పీఆర్‌సీలను వర్తింపజేయాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎలాంటి వివక్ష లేకుండా తమకు పీఆర్‌సీలు వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం (ఎస్‌జీపీఏటీ) తెలంగాణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్ ఆదివారం సంయుక్త ప్రకటనలో కోరారు. ఈ మేరకు సంతకాల ఉద్యమం చేపడుతున్నామని, ఇందులో భాగంగా ఈనెల 23వ తేదీ ఉదయం 10:30 గంటలకు జిల్లాలోని పింఛన్‌దారులు కలెక్టరేట్‌కు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ బకాయిలను సత్వరమే విడుదల చేయాలని, నగదురహిత వైద్య సేవల విధివిధానాలు రూపొందించాలన్నారు.

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



పాన్‌గల్: మీకు అండగా మేముంటాం, ప్రజలకు ధైర్యాన్ని ఇవ్వడానికి కవాతు నిర్వహిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) బలగాలతో ఆదివారం మండల కేంద్రంలో, మాందాపూర్ గ్రామాల్లో కవాతు నిర్వహించారు. మండలంలో ఎటువంటి అల్లర్లు సృష్టించిన, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో మత ఘర్షణలు, శాంతి భద్రతల సమస్యలు వస్తే సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను అదుపు చేయడంలో స్థానిక పోలీసులకు ర్యాపిడ్ బలగాలు సహకరిస్తాయన్నారు. ఆయా గ్రామాల్లో ప్రధాన వీధులు గుండా కవాతు నిర్వహించారు. కవాతులో ఎస్ఐ శ్రీనివాసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ అధికారులు జాదేరాహుల్, జటా శంకర్‌యాదవ్, రాముడు, ఫోర్స్ బలగాలు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి సర్వం సిద్ధం

- నర్సరీల్లో 1.38 లక్షల మొక్కలు
- జూలై మొదటి వారంలో పంపిణీకి శ్రీకారం
- పచ్చదనంతో మురియనున్న పల్లెలు

కేటీదొడ్డి: ఒక వైపు వ్యవసాయ కూలీలకు పని కల్పిస్తూనే మరోవైపు రైతులకు మేలు చేయడంతో పాటు పల్లెలను పచ్చదనంగా మార్చేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వనమహోత్సవానికి ప్రభుత్వం సిద్ధమవుతుంది. ఈ క్రమంలో జూలై నెలలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఏర్పాట్లు సిద్ధం..

ఈ ఏడాది కూడా వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నర్సరీల్లో ఏర్పాటు చేసిన మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వర్షాలతో పాటు ప్రభుత్వం ఆదేశాలు వచ్చిన వెంటనే జూలై మొదటి వారంలో మొక్కలు నాటేందుకు సంబంధిత అధికారులు సమాయత్తమవుతున్నారు. మండలంలోని 23 గ్రామాలకు అన్ని గ్రామాల్లో నర్సరీల ద్వారా వన సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఒక్కో గ్రామంలో కనీసం 5 వేల నుంచి 6 వేల వరకు మొత్తం 1.38 లక్షల మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేశారు. ఇందులో వివిధ రకాలకు చెందిన నీడనిచ్చే మొక్కలతో పాటు పండ్ల మొక్కలు పెంచారు. ఇంటింటా మొక్కలు పంపిణీ చేసేందుకు సంబంధిత అధికారులు తగు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పంటల సాగుకు అనుకూలంగా లేని భూములు, పొలం గట్లపై మొక్కల పెంపకాన్ని చేపట్టేందుకు ఒక్కో రైతుకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేయనున్నారు. దీంతో పాటు ప్రభుత్వం భూములు, పాఠశాలలు, రోడ్లకు ఇరువైపులా గుట్టలపై మొక్కలు నాటనున్నారు. ఉపాధి కూలీల ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇప్పటికే వన సంరక్షణ కేంద్రాల్లో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.



ఇర్కిచేడులో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు



వెంకటాపురం శివారులోని నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

ప్రతి గ్రామానికి పంపిణీ చేస్తాం



నర్సరీల్లో 1.38 లక్షల మొక్కల పెంపకాన్ని చేపట్టాం. ప్రతి గ్రామంలో మొక్కల పంపిణీకి ఏర్పాట్లు సిద్ధం చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వర్షాలు పడగానే జూలై మొదటి వారంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొక్కల పెంపకంతో కూలీలు, రైతులకు మేలు జరగడంతో పాటు పల్లెలు పచ్చదనంగా మారనున్నాయి. రైతులు పండ్ల తోటలు పెట్టేందుకు ముందుకు వస్తే వారికి ఈజీఎస్ ద్వారా మొక్కల పెంపకానికి ప్రోత్సాహకాలు అందజేస్తారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– కృష్ణమోహన్, ఎంపీడీఓ, కేటీదొడ్డి

ఎస్ఐగా బాధ్యతలు స్వీకరణ



రాజోళి: రాజోళి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా కె.గోకారి ఆదివారం బాధ్యత లు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న జ గదీశ్ నాగర్ కర్నూల్ జి ల్లా కోడేరు మండలానికి బదిలీ కాగా.. అదే స్టేషన్ లో ఎస్ఐగా పని చేస్తున్న గోకారి రాజోళి స్టేషన్ కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్, పలువురు నాయకులు ఎస్ఐను సన్మానించారు. స్టేషన్ సిబ్బంది ఎస్ఐకు అభినందనలు తెలియజేశారు.

నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

అయిజ: సర్వేయర్ తేజేశ్వర్‌ను దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెర్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి, కేసులో పురోగతి సాధించాలన్నారు. తేజేశ్వర్ హత్య వెనుక ఉన్న కుట్రదారులెవరో తేల్చాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం



చాగాపురంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న అధికారులు



కొండాపురంలో భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేటీదొడ్డి: నిరుపేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాకారమని నాయకుడు శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు నిర్మాణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అన్ని నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో రాజేష్, పవన్, తిమ్మారెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులకు భూమిపూజ

అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురం, ఉప్పల, జడదొడ్డి, భూంపురం, మేడికొండ గ్రామాల్లో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఈ వంశీ, కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జయన్న, జిల్లా కార్యదర్శి రాజు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ఇంటి నిర్మాణానికి

ఇటిక్యాల: మండల పరిధిలోని చాగాపురం గ్రామంలో ఇందిరమ్మ మోడల్ గృహానికి హౌసింగ్ శాఖ ఏఈ ప్రియాంక ముగ్గుపోసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపడుతుందన్నారు. మార్చి నాటికి బేస్‌మెంట్ పూర్తి చేసిన లబ్ధిదారులకు మొదటి విడతలో రూ.లక్ష రూపాయలు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు అల్లబకాష్, చాంద్‌బాష, స్వాములు, రాముడు, లింగన్న, భీమన్న, తిక్కయ్య, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్లాస్‌పురంలో భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో

ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండేరు, సాసనూలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమం చేపట్టారు. హౌసింగ్ శాఖ ఏఈ ప్రియాంక ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, కార్యదర్శులు రాజు, వినోద్‌కుమార్, నాయకులు సోమనాద్రి, నర్సింహ, రాజు, విజయ్, వెంకటేష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మోటార్ చోరీ

గట్టు: మండల పరిధిలోని మాచర్ల ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంటు మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపరించుకుపోయారు. ఆదివారం ఉదయం వాటర్ ప్లాంట్ గది తలుపులు తెరచి ఉన్న విషయాన్ని గుర్తించిన స్థానికులు స్కావెంజర్ నాగరాజు తెలియజేశారు. ఈ క్రమంలో మోటార్‌తో పాటు కంట్రోల్ బోర్డు స్టెబిలైజర్‌ను దొంగలించినట్లు స్కావెంజర్ నాగరాజు గట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ పాఠశాల కంప్యూటర్ గదిని తాళాలు పగులగొట్టి కంప్యూటర్లను ధ్వంసం చేసిన విషయం విధితమే.

కల్వర్టులకు మరమ్మతు చేయండి సారూ

ఎర్రవల్లి: మండల పరిధిలోని ఆర్‌అండ్‌బీ రహదారులపై గతంలో నిర్మించిన కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండల కేంద్రం నుంచి రాజశ్రీ గార్లపాడు వెళ్లే రోడ్డుపై పలు కల్వర్టులు కూలి ఏళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు పేర్కొన్నారు. అదే విధంగా సాసనూలు, షేకుపల్లి, గ్రామాల సమీపంలోని కల్వర్టులు కూలిన ప్రదేశంలో ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి కూలిన కల్వర్టులకు మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



సాసనూలు వద్ద గుంతలు పడిన కల్వర్టు

భారీ వర్షంతో రైతుల హర్షం



కేటీదొడ్డిలో కురుస్తున్న వర్షం

కేటీదొడ్డి/ధరూరు: మండలాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో రాత్రి 7 నుంచి 8 గంటల వరకు సుమారు గంటపాటు కుండపోత వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో ముంగారు పంటల సాగు అనుకూలంగా ఉందని రైతులు హర్షం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మెట్ట పంటల్లో విత్తుకున్న విత్తనాలు త్వరగా మొలకెత్తేందుకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. నారు మడులు సిద్ధం చేసుకున్న రైతులు వరినాట్లకు కరిగెటు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఎన్నికలకు జంకుతున్న కాంగ్రెస్ సర్కార్

అయిజ: స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం జంకుతోందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్ల మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పలుమార్లు గడువు పెంచుకుంటూ పోతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుంటే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోతాయని వాపోయారు. గ్రామ పంచాయతీ వ్యవస్థకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చనందుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదన్న, పట్టణ ఉపాధ్యక్షుడు నాగరాజు, వీరేష్‌గౌడ్, లక్ష్మణాచారి, రఘు, మాధవాచారి, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భగత్‌రెడ్డి

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

అయిజ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రామకృష్ణ మఠం స్వామీజీ తత్వానంద మహరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని సంకాపురం గ్రామంలో రామకృష్ణ ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహరాజ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్న వయసు నుంచే ఆధ్యాత్మిక భావన వైపు నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర భావ ప్రచార పరిషత్ మాజీ కన్వీనర్ సూర్యప్రకాశ్, రామకృష్ణ సేవా సమితి సభ్యులు వెంకటరాములు, కృష్ణ, సత్యనారాయణ, ఈశ్వర్, గోపాల్, ఈశ్వరన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తత్వానంద మహరాజ్

రోడ్లు ఛిద్రం.. జర భద్రం



చాగాపురం సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

గట్టు: మండల పరిధిలోని బీటీరోడ్లు భారీ వాహనాల రాకపోకలతో ఛిద్రమవుతున్నాయి. గట్టు సమీపంలో చేపడుతున్న భారత్‌మాల రోడ్డుతో పాటుగా గట్టు ఎత్తిపోతల పథకంలో ఉపయోగిస్తున్న టిప్పర్ల కారణంగా గట్టు మాచర్ల, గట్టు గొర్లఖాన్‌దొడ్డి బీటీరోడ్లు దెబ్బతిన్నాయి. బల్గెర వైపు నుంచి ఇసుక లోడ్‌తో నిత్యం అనేక టిప్పర్లు గట్టుదాటి వెళ్తుంటాయి. రోడ్లు ధ్వంసమవుతున్నా పట్టించుకునే నాథుడే లేరని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రోడ్లపై గుంతలు ఏర్పడిన చోట కనీసం ప్యాచ్‌వర్క్ కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కోతకు గురవుతున్న రోడ్డు

రాయాపురం స్టేజీ నుంచి గట్టు రైతువేదిక వరకు ఇటీవల నిర్మించిన బీటీరోడ్డు కోతకు గురవుతుందని వాహనదారులు వాపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వేసిన మట్టికొట్టుకు పోయింది. రోడ్డు కోతకు గురైన చోట కనీసం సూచికలు కూడా ఏర్పాటు చేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గుంతలను పూడ్చండి సారూ..

ఇటిక్యాల: మండల కేంద్రం నుంచి చాగాపురం వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి తీవ్రఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కన్పించక అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. గుంతలను పూడ్చాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

మల్దకల్: మండల పరిధిలోని బీటీ రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్ల మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు,ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దొడ్డి– మల్దకల్, మల్దకల్– మద్దెలబండ, అమరవాయి– బిజ్వారం, కుర్తిరావులచెర్వు– మల్దకల్ గ్రామాల మధ్య ఉన్న రోడ్లపై మలుపులు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మట్టిరోడ్డును తలపిస్తున్న గట్టు- మాచర్ల రహదారి



గట్టు సమీపంలో కోతకు గురైన రోడ్డు

నత్తనడకన అభివృద్ధి పనులు

- 2018లో రూ.15 కోట్ల నిధులు మంజూరు
- ఏర్పాటు చేయని బస్‌షెల్టర్, జంక్షన్లు
- పూర్తికాని రోడ్డు డివైడర్ గ్రీనరీ పనులు

అయిజ: మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు 2018 మార్చి 3వ తేదీన టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుంచి రూ. 15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులు ఖర్చు చేసేందుకు అదే సంవత్సరం మున్సిపల్ అధికారులు అనేక అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించారు. అయితే ఇప్పటి వరకు అభివృద్ధి పనులు పూర్తకాక ఇబ్బందులు పడుతున్నట్లు పట్టణ ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా సెంట్రల్ లైటింగ్ సిస్టం, బస్ షెల్టర్ ఏర్పాటు చేయక అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు.

అసంపూర్తిగా అభివృద్ధి పనులు

అంబాభవానీ ఆలయం నుంచి పెట్రోల్ బంక్ చౌరస్తా వరకు రోడ్డు వెడల్పు, డివైడర్, గ్రీనరీ ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. పాత బస్టాండ్ నుంచి పీహెచ్‌సీ వరకు రోడ్డు వెడల్పు చేసి డివైడర్ నిర్మించారు కానీ గ్రీనరీ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయలేదు. అదే విధంగా పట్టణంలోని పాత బస్టాండ్, పెట్రోల్ బంక్ చౌరస్తా, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రదేశాల్లో జంక్షన్లు ఇప్పటి వరకు నిర్మించలేదు. వెల్‌కం ఆర్చెస్ (స్వాగత కమాన్లు), రాయచూర్ రోడ్డు పక్కన క్లాక్‌టవర్, బస్‌స్టాప్ నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు కనీసం పునాది కూడా వేయలేదు. ప్రధాన ప్రదేశాల్లో బస్ షెల్టర్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.



గ్రీనరీ ఏర్పాటు చేయాల్సిన డివైడర్



షెల్టర్ నిర్మించాల్సిన ప్రదేశం

వేగవంతం చేయాలి



మున్సిపాలిటీలో ఏడేళ్ల క్రితం చేపట్టిన అభివృద్ధి పనులు నేటికీ పూర్తి కాలేదు. ముఖ్యంగా పట్టణంలో జంక్షన్లు ఏర్పాటు చేసి ఆర్చీలు నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆ పనులు ప్రారంభించలేదు. అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలి.

– వెంకటేష్, అయిజ

నత్తనడకన పనులు



మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. పాతబస్టాండ్ నుంచి పీహెచ్‌సీ వరకు ఇప్పటి వరకు డివైడర్‌పై కట్టలు నిర్మించి, గ్రీనరీ ఏర్పాటు చేయలేదు. పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలి.

– కృష్ణ, అయిజ

నిధుల కొరత



నిధుల కొరతతోపాటు పలు కారణాలతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టలేదు. డివైడర్‌పై ఇరువైపులా కట్టలు నిర్మించి మధ్యలో మొక్కలు పెంచాల్సి ఉంది. అదే విధంగా జంక్షన్లు, ఆర్చీలు నిర్మించాల్సి ఉంది. నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం.

– సీహెచ్ సైదులు, మున్సిపల్ కమిషనర్